ఎమ్మెల్యే కూనంనేనికి హైకోర్టు నోటీసులు

అఫిడవిట్‌లో సరైన సమాచారం సమర్పించలేదన్న పిటిషన్‌పై విచారణ

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 22 (నమస్తే తెలంగాణ): కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు రాష్ట్ర హైకోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల సంఘానికి ఇచ్చిన అఫిడవిట్‌లో సరైన సమాచారం పొందుపర్చలేదని, ఆస్తుల వివరాలను సక్రమంగా ప్రకటించలేదని, అతడిపై ఉన్న కేసులను చూపలేదని ఆరోపిస్తూ ఓటమి చెందిన అభ్యర్థుల తరఫున హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీంతో ఈ పిటిషన్‌ను పరిశీలించిన ఉన్నత న్యాయస్థానం.. శుక్రవారం కూనంనేనికి నోటీసులు జారీ చేసింది. ఈ అంశం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి

'ఫ్లాగ్ మార్చ్'లో ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ సింగ్

మాట్లాడుతున్న ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ సింగ్

కొత్తగూడెం క్రైం, మార్చి 22: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి పౌరుడూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్‌సింగ్ సూచించారు. త్వరలో పార్లమెంటు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ అధ్యక్షతన లక్ష్మీదేవిపల్లి నుంచి కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ వరకూ చేపట్టిన 'ఫ్లాగ్‌మార్చ్'లో ఆయన మాట్లాడారు. ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల మేరకు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్లు తమ ఓటు హక్కుని నిర్భయంగా వినియోగించుకునేందుకే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఇలాంటి భరోసా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పోలీసు అధికారులు సతీశ్‌కుమార్, రాజు, వినయ్‌కుమార్, కరుణాకర్, రమేశ్, శివప్రసాద్, ఇంద్రసేనారెడ్డి, రాయల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'ఆర్‌టీఐ'పై అధికారులకు అవగాహన అవసరం

– సింగరేణి జీఎం బసవయ్య

కొత్తగూడెం సింగరేణి, మార్చి 22: సమాచార హక్కు చట్టంపై అధికారు లు, ఉద్యోగులు అవగాహన కలిగి ఉం డాలని సింగరేణి జీఎం (పర్సనల్) బసవయ్య అన్నారు. సమాచార హక్కు చట్టంపై సింగరేణి అధికారులు, ఉద్యోగులకు స్థానిక ఇల్లెందు క్లబ్‌లో శుక్రవా రం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమా న్ని ఆయన ప్రారంభించారు. కొత్తగూ డెం రీజియన్ కార్పొరేట్, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ఏరియా ప్రజా సమాచార అధికారులకు, అదనపు ప్రజా సమాచార అధికారులకు, సంబంధిత అధికారులు, సిబ్బందికి రెండు రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. ఆర్‌టీఐపై సమగ్ర శిక్షణను విశాఖపట్నానికి చెందిన హిందుస్తాన్ అకాడమీ ఆఫ్ లా ప్రొఫెసర్ పార్వతీశం ఇస్తారని చెప్పారు. సింగరేణి అధికారులు కృష్ణయ్య, ముకుంద సత్యనారాయణ పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీలో ప్రవేశానికి ఆహ్వానం

భద్రాచలం, మార్చి 22: గురుకుల డిగ్రీ కళాశాలల్లో మొదటి ఏడాదిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లోని మణుగూరు (పురుషులు), కొత్తగూడెం (మహిళలు), దమ్మపేట (మహిళలు), ఖమ్మం (మహిళలు) గురుకుల డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు ఈ ఏడాది ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లోనైతే రూ. 1.50లక్షలకు, పట్టణ ప్రాంతాల్లోనైతే రూ. 2లక్షల లోపు ఉండాలని తెలిపారు. ఇంటర్‌లో కనిసం 40 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు ఆన్‌లైన్‌లో (www.tgwgurukulam. telangana.gov.in) ఏప్రిల్ 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 28న ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్సీవోలు వెంకటేశ్వరరాజు, కె.నరేందర్, ఏవో బి.కృష్ణ ఆయా గుకుకుల డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకోండి

అశ్వారావుపేట, మార్చి 22: ఖాతాదారులకు అందిస్తున్న డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ సూచించారు. శుక్రవారం బ్యాంక్‌లో ఖాతాదారులైన వ్యాపారులకు చిల్లర నాణాలను అందజేసి మాట్లాడారు. మార్కెట్‌లో చిల్లర నాణాల కొరత లేకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు రూ.1, 2, 5, 10 నాణాలను కాయిన్స్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రూ.10 నాణెం చెల్లుబాటుపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, రూ.10 నాణేలు చెలామణి అవుతాయన్నారు. కార్యక్రమంలో తిరుమలకుంట బ్రాంచ్ మేనేజర్ మురళీ కృష్ణ, బ్యాంక్ సిబ్బంది శ్రీధర్, నాగబాబు, మాధవి, హారిక, మనోహర్, జరీనా, వ్యాపారస్థులు పాల్గొన్నారు.

67 కిలోల గంజాయి పట్టివేత

భద్రాచలం, మార్చి 22: భద్రాచలంలో గంజాయి పట్టుబడింది. పోలీసులు తెలిపిన వివరాలు... భద్రాచలం బ్రిడ్జి సెంటర్ వద్ద ఎస్సై విజయలక్ష్మి ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో చింతూరు నుంచి వస్తున్న బొలేరో వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో సుమారు 67 కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. సుమారు రూ.16.75లక్షల విలువైన ఈ సరుకును తీసుకొస్తున్న సిద్దిపేటకు చెందిన ఒకరిని అరెస్ట్ చేశారు. గంజాయిని, వాహనాన్ని స్వాధీనపర్చుకున్నారు. కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టుకు అప్పగించనున్నట్లు తెలిపారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్షయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **భద్రాచలం బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు హామీన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **భట్టు మురళీ** S/o : **(లేటు) కబీర్, వయస్సు : 36**సం॥లు, **వృత్తి :** కూలీ, **నివాసం :** ఇ.నెం.5-2-68/1/A, కబీర్‌కుంట, గాంధీనగర్, నవభారత్ ఏరియా, పాల్వంచ, పాల్వంచ మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గార్లకు ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు.కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : జిల్లా రిజిష్టారు, ఖమ్మం, సబ్ రిజిష్టార్ వారి ఇలాఖా కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం, పాల్వంచ మున్సిపల్ పరిధిలోని చేరిన పాల్వంచ నవభారత్ ఏరియా గాంధీనగర్ యందు గల ఇంటి నెంబర్ 5-2-81(Part) ఖాళీ స్థలంతోసహ గల దాని మొత్తం వైశాల్యం :167.96చ॥గ॥ / 140-43 చ॥మీ॥, డాక్యుమెంట్ నెం. **280/2023.** సదరు ఆస్తికి హద్దులు:**తూర్పు :** డ్రైనేజ్, **పడమర :** మనలో నెం.2వ వార్డైన భట్టు ప్రసాద్ గారి వాటాకు రాబడిన స్థలము, ఇల్లు. **ఉత్తరం :** భట్టు లక్ష్మణ్ గారి స్థలం, **దక్షిణము :** డ్రైనేజ్ తదుపరి యం. శ్రీరామరాజు గారి ఇల్లు.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం.సెల్ : 9849246278

ఐఎఫ్‌టీయూ నేత కిరణ్‌కు నివాళి

మణుగూరుటౌన్, మార్చి22: ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు, ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్లకొండ కిరణ్ మృతిపట్ల మణుగూరులో శుక్రవారం పలు కార్మిక సంఘాల నాయకులు సంతాపం వ్యక్తంచేశారు. పట్టణంలోని సురక్షాబస్టాండ్ ఆటో అడ్డాలో ఏర్పాటు చేసిన సంతాపసభలో ఆటో యూనియన్ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు నివాళి అర్పించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షు డు మధుసూదన్‌రెడ్డి, నాయకులు నర్సింహారావు, అప్పయ్య, రాములు, వెంకట్, అంజి, కిశోర్, ప్రసాద్, లక్ష్మణ్, నాగరాజు, చారి పాల్గొన్నా రు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

రహదారి వెంట స్వైర విహారం చేస్తూ అటుగా వచ్చిపోయే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్న వానరాలు, చిన్నారి కాలికి కోతి కరిచిన గాయం

చండ్రుగొండపై వానర దండు

- ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాల లూటీ
- మహిళలు, చిన్నారులపై నిత్యం దాడులు
- ఆసుపత్రిలో రోజుకు ఐదు – పది కేసులు

చండ్రుగొండ, మార్చి 22: మండల కేంద్రమైన చండ్రుగొండలో కోతుల బెడద తీవ్రమైంది. ప్రతిరోజూ కోతుల నుంచి ఇబ్బందులు పెరిగిపోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రోజూ ఏదో ఒక చోట పలువురి కోతులు కరుస్తూనే ఉన్నాయని చెబుతున్నారు. కోతులు కరిచిన కేసులు రోజుకు ఐదు నుంచి పది వరకూ వస్తున్నాయని వైద్యులు కూడా చెబుతున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది. మండలంలో సుమారు వెయ్యి నుంచి పదిహేను వందల వరకు కోతులు సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్ధుల వద్ద చేతిలో సంచులుగానీ, మరేవైనా వస్తువులు గానీ కన్పిస్తే చాలు.. వెంటపడి మరీ లాక్కుంటున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లలోకి చొరబడి మరీ ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. తినుబండారాలు కోతుల కంటపడితే చాలు.. వాటి సంగతి తేల్చే వరకూ విశ్రమించం లేదు. ఒంటిరిగా నడిచే మహిళలు, చిన్నారులపై దాడి మరీ కరుస్తున్నాయి. ప్రధానంగా గుడి ఏరియా, బస్టాండ్, పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, రావిచెట్టు బజార్, జడ్పీ హైస్కూల్ తదితర ప్రాంతాల్లో నిత్యం గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి.

కుక్క కరిచిన చోట క్లీన్ చేస్తున్న నర్సు

కోతులు కరిచిన కేసులు రోజూ వస్తున్నాయి..

కోతులు కరిచిన కేసులు మా ఆసుపత్రికి రోజూ వస్తూనే ఉన్నాయి. నిత్యం ఐదు నుంచి పది కేసులు తగ్గడం లేదు. కోతులు ముఖ్యంగా చిన్నారులను కరవడం, గీరడం వంటి ఎక్కువగా వస్తున్నాయి. చివరికి మా ఆసుపత్రిలోకి కూడా కోతులు వస్తున్నాయి.

–కనకం తనూజ, మెడికల్ ఆఫీసర్, చండ్రుగొండ వైద్యశాల

కోతులను పట్టించే కార్యక్రమం చేపడతాం..

కోతుల బెడద ఉన్న మాట వాస్తవమే. వాటిని పట్టుకునే చర్యలు తీసుకుంటాం. అన్ని గ్రామాల్లోనూ కోతుల సమస్య ఉంది. వేరే చోట పట్టిన కోతులను కొందరు తెచ్చి ఇక్కడ వదిలుతున్నారు. దీంతో సమస్య మరింత పెరుగుతోంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్తాం. ప్రోవిజన్‌ను సైతం పరిశీలిస్తాం.

–అశోక్, ప్రత్యేకాధికారి, చండ్రుగొండ పంచాయతీ

చేతిలోని వస్తువులనూ లాక్కొని వెళ్తున్నాయి..

మా గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. వరండాలో కూర్చొని భోజనం చేయాలన్నా భయమేస్తోంది. వానరాలు ఎటు నుంచి వస్తాయో తెలియక ఇంట్లోకి వెళ్లి తలుపులు మూసుకొని మరీ అన్నం తింటున్నాం. ఇంటి వద్ద కచ్చితంగా ఒక మనిషి కాపలాగా ఉండాల్సి వస్తుంది. చేతిలో ఉన్న వస్తువులను లాక్కొని వెళ్తున్నాయి.

–కడియాల వెంకటేశ్వర్లు, గ్రామస్తుడు, చండ్రుగొండ

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం తప్పనిసరి

కొత్తగూడెం అర్బన్, మార్చి 22: గర్భిణులు, తల్లులకు పౌష్టికాహారం తప్పనిసరి అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి సూచించారు. 'పోషణ్ పక్వాడ్'లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని పాత కొత్తగూడెం –2 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పుట్టిన గంట లోపే బిడ్డకు ముర్రుపాలు తాగించడం ఎంతో శ్రేష్టమని అన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. అంగన్‌వాడీ టీచర్లు మణి, వెంకటరమణ, నందిని, రజిత, పద్మ, సరిత రాణి, వెంకటలక్ష్మి, వనితారాణి పాల్గొన్నారు.

అశ్వాపురం: సీమంతాలు నిర్వహిస్తున్న సీడీపీవో ప్రమీల, టేకులపల్లి: ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో తార

మర్రిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో

అన్నపురెడ్డిపల్లి, మార్చి 22: తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగాజలం అన్నారు. శుక్రవారం మండలంలోని మర్రిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరభ్యాసాలు నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సామ్యతండాలో..

చండ్రుగొండ, మార్చి 22: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి అన్నారు. శుక్రవారం మండలంలోని సామ్యతండాలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఇందు, అంగన్‌వాడీ టీచర్లు సరోజ, జ్యోతి, కుమారి, రమ్య, యశోధ పాల్గొన్నారు.

బేతంపూడి, సులానగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో..

టేకులపల్లి, మార్చి 22: టేకులపల్లి ప్రాజెక్టు పరిధి బేతంపూడి, సులానగర్ అంగన్‌వాడీ సెంటర్లలో సీడీపీవో కేఎం తార, సెక్టార్ సూపర్‌వైజర్లు నిర్మల అనురాధ, లక్ష్మి, యశోద, సక్కుబాయి ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు సుగుణ, లలితకుమారి, స్వరూప, స్వరాజ్యలక్ష్మి, విజయకుమారి పాల్గొన్నారు.

సవళ్లగూడెం-2 అంగన్‌వాడీ కేంద్రంలో

అశ్వాపురం, మార్చి 22: మండలంలోని మల్లెలమడుగు పంచాయతీ పరిధి సవళ్లగూడెం–2 అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో ప్రమీల పోషణ పక్వాడ కార్యక్రమానికి నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు రెడ్డి అరుణ, నాగమణి, రావమ్మ, సాహితి, దీప్తి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో 'త్రివేణి' విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల బాధ్యులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, మార్చి 22: స్థానిక లక్ష్మీదేవిపల్లిలోని త్రివేణి పాఠశాల విద్యార్థులు యోగా పోటీల్లో ప్రతిభ కనపర్చారు. బెంగళూరు రాజాజినగర్ కేంద్రంగా ఆన్‌లైన్ వేదికగా శివజ్యోతి యోగా కేంద్రం 13వ యోగోత్సవ్ 2024 కార్యక్రమాన్ని జనవరి 26, 27, 28 తేదీల్లో నిర్వహించినట్లు చెప్పారు. ఈ యోగా పోటీల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపర్చి బహుమతులు సాధించినట్లు పాఠశాల బాధ్యులు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి అభినందించారు. పాఠశాల బాధ్యులు గొల్లపూడి జగదీశ్, కాట్రగడ్డ మురళీకృష్ణ, శ్రీనివాస్‌సింగ్, వైవీ సురేష, సౌజన్య, యోగా గురువు గుమలాపురం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉన్నత చదువుకు విదేశీ విద్య తోడ్పాటు

విద్యార్థులకు సూచనలిస్తున్న రవి

అశ్వారావుపేట, మార్చి 22: ఉన్నత చదువుకు విదేశీ విద్య తోడ్పాటుగా ఉంటుందని స్కాలర్షిప్ ఈబీఎస్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ డైరెక్టర్ బీ రవి అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కళాశాలలో విదేశీ విద్యా అవకాశాలపై అవగాహన కల్పించారు. విదేశీ విద్యకు అవసరమైన అర్హత సాధించేందుకు నిర్వహించే ఐఈఎల్‌టీఎస్, టోఫెల్, జీఎంఏటీ, పీటీఈ తదితర పరీక్షలు, నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ సెల్, టాక్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ జీ గోపాలకృష్ణ మూర్తి, ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌చార్జి కోటేశ్వర రావు, టాక్ క్లబ్ ఇన్‌చార్జి డాక్టర్ శ్రావణ్, సంస్థ ప్రతినిధులు పీ పుతిన్, పీ శంకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు సర్వాంగ స్వర్ణ కవచాలంకరణ

కల్యాణం జరుపుతున్న అర్చకుడు

భద్రాచలం, మార్చి 22: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలవరులకు అర్చకులు శుక్రవారం సర్వాంగ స్వర్ణ కవచాలను ధరింపజేశారు. నిత్య పూజలు చేశారు. నిత్య కల్యాణ మూర్తులకు బేడా మండపంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

నేటి నుంచి బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

అన్నపురెడ్డిపల్లి, మార్చి 22: అన్నపురెడ్డిపల్లి బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఆరాధన, విష్వక్సేనారాధన, అంకురారోపణం, యాగశాల ప్రవేశం, చతుస్థానార్చన, 24న ధ్వజారోహణ, మహానివేదన, సంతానం లేనివారికి గరుడ ప్రసాదం పంపిణీ, నిత్యహోమం, 25న గజవాహన సేవ, పల్లకిసేవ, ఎదుర్కోలు ఉత్సవం, రాత్రి 10 గంటలకు శ్రీస్వామి వారి కల్యాణ మహోత్సవం, 26న రథోత్సవం, దొంగల దోపోత్సవం, 27న శ్రీస్వామి వారి ఊంజల సేవ, దీపోత్సవం, 28న చక్రస్నానం, శృంగా డోలోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

రేపు మోక్ష వేంకటేశ్వరస్వామవారి కల్యాణం

పాల్వంచ, మార్చి 22: మున్సిపాలిటీ పరిధిలోని గుడిపాడు గ్రామంలో ఉన్న శ్రీ మోక్ష వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆరెం ప్రశాంత్ పేర్కొన్నారు. పాల్వంచలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుడు ఆలయ పునర్నిర్మాణానికి శ్యామల గోపాల్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ ఎన్ఎస్ఆర్ దంపతులు దేవాదాయ శాఖ సహకారంతో స్వామివారికి రూ.కోటి విరాళం ప్రకటించినట్లు చెప్పారు.

పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం

పాల్వంచ రూరల్, మార్చి 22: మండలంలోని కేశవాపురం–జగన్నాథపురం గ్రామాల మధ్య వెలసిన పెద్దమ్మతల్లి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. తొలుత మేళతాళాలతో దేవస్థాన అర్చకులు, భక్తులు కలిసి అమ్మవారి జన్మస్థలం వద్ద ఉన్న పెద్దమ్మతల్లికి పంచామృతాలు, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం దేవాలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. తరువాత పంచ హారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు చేశారు.

టీ-హబ్ పరీక్షలు పెంచాలి

దమ్మపేట, మార్చి 22: టీ–హబ్‌లో నిర్వహించే పరీక్షల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని పట్వారిగూడెం, దమ్మపేట పీహెచ్‌సీలను ఆమె శుక్రవారం సందర్శించారు. దమ్మపేట, పట్వారిగూడెం వైద్యాధికారులు మణిదీప్, దివాకర్ నాయక్‌లతో మాట్లాడుతూ దవఖానాలకు వస్తున్న రోగుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట డాక్టర్ సుకృత ఉన్నారు.

కోడ్ అతిక్రమిస్తే కఠిన చర్యలు

టేకులపల్లి, మార్చి 22: పార్లమెంట్ ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను హెచ్చరించారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ తాటిపాముల సురేశ్ అధ్యక్షతన అన్ని పార్టీల ముఖ్య నాయకులతో సమావేశంలో ఏర్పాటు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళికి లోబడి ఉండాలని కోరారు. అన్ని పార్టీల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను పాటించాలి

అన్నపురెడ్డిపల్లి, మార్చి 22: ఎన్నికల నియమ, నిబంధనలను కచ్చితంగా పాటించాలని, నింబధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై చంద్రశేఖర్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని బూర్గుడెం శివారు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే ఆధారాలు చూపించాలని, లేనట్లయితే నగదును సీజ్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాలు నిర్దేశించుకుని సాధన చేయాలి

అశ్వారావుపేట, మార్చి 22: తల్లిదండ్రుల ఆశయాల మేరకు భవిష్యత్ లక్ష్యాలు నిర్దేశించుకుని సాధన చేస్తే సత్ఫలితాలు అందుకోవచ్చని విద్యావేత్త, కెరీర్ గైడెన్స్ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని నారంవారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయన కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

చుంచుపల్లి ఎస్సై సమయ స్ఫూర్తి.. తప్పిన ప్రమాదం..

చుంచుపల్లి, మార్చి 22: చుంచుపల్లి ఎస్సై సమయ స్ఫూర్తితో పెనుప్రమాదం తప్పింది. మండలంలోని చుంచుపల్లి తండాకు చెందిన భూక్యా మంగత్యా ఇంట్లో గురువారం రాత్రి 9 గంటలకు గ్యాస్ సిలిండర్ లీకై ఇల్లు కాలిపోతోంది. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై గడ్డం ప్రవీణ్‌కుమార్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్యాస్ పొయ్యి నుంచి మంటలు వస్తున్నప్పటికీ సమయస్ఫూర్తితో వ్యవహరించి ధైర్యంగా ఇంట్లోకి వెళ్లి మంటలను అదుపు చేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది.

దమ్మపేట సొసైటీ ఉపాధ్యక్షుడిగా ఎర్రప్ప

దమ్మపేట, మార్చి 22: దమ్మపేట సొసైటీ ఉపాధ్యక్షుడిగా కట్టం ఎర్రప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తొలుత ఎన్నికైన ఉపాధ్యక్షుడు టీడీపీ చెందిన నాయుడు చెన్నారావు మృతి చెందడంతో టీడీపీకి చెందిన కట్టం ఎర్రప్పను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఎల్లిన రాఘవరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేడు శనిత్రయోదశి పూజలు

సారపాక, మార్చి 22 : సారపాకలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ నవగ్రహ మండపంలో శనివారం శనిత్రయోదశి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సేవాసమితి నిర్వాహకులు శుక్రవారం తెలిపారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

భద్రాచలం, మార్చి 22: పట్టణంలోని సీతారామనగర్ కాలనీలోగల శ్రీదేవి, భూదేవి సమేత వేంకట